సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



వికాస్ విద్యాసంస్థపై విచారణ

ఫీజులు చెల్లించినా టీసీలు ఇవ్వడం లేదనే ఫిర్యాదుల నేపథ్యంలో జంగారెడ్డిగూడెంలోని వికాస్ విద్యాసంస్థపై ఏలూరు డీఈఓ శ్యామ్‌సుందర్ విచారణ చేశారు. 8లో ▸



సత్వర న్యాయం అందించాలి

వివాదాలను పరిష్కరించడంతో పాటు పేదలకు సత్వర న్యాయం అందించడమే న్యాయ వ్యవస్థ లక్ష్యం అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి అన్నారు. 8లో ▸



ఫిట్‌నెస్ పరీక్ష రద్దు

ఎస్సై పోస్టుల భర్తీలో భాగంగా శనివారం నిర్వహించాల్సిన దేహదారుఢ్య పరీక్షలు వర్షం కారణంగా రద్దయ్యాయి. ఈ పరీక్షను వచ్చేనెల 11న నిర్వహిస్తామని డీఐజీ తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

2024 ఎన్నికల్లో ధర్మమే గెలుస్తుంది

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం రూరల్: రాబోయే 2024 ఎన్నికల్లో ధర్మమే గెలుస్తుందని, తిరిగి రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను చంద్రబాబు గ్రహించలేక పోతున్నాడని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. సీఎం జగన్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో 151 సీట్ల కంటే ఎక్కువ స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం ఖాయమని స్పష్టం చేశారు.

మదర్ థెరిస్సా సేవలు అజరామరం



మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ వంక

తణుకు అర్బన్: మదర్ థెరిస్సా సేవలను యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా తణుకు ఎన్టీఆర్ పార్కు ప్రాంతంలో ఉన్న ఆమె విగ్రహానికి మంత్రి కారుమూరి పూలమాలలువేసి నివాళులర్పించారు. మదర్ థెరిస్సా సేవలు అజరామరమని కొనియాడారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామ రాజు, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు సుద్దుల పాండు పాల్గొన్నారు.

ట్రస్టు ఆసుపత్రి సేవలు అభినందనీయం



ఆధునిక వైద్య పరికరాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెంటపాడు: అలంపురంలో ఎనిమిదేళ్లుగా ట్రస్టు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలు అభినందనీయమని రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం అలంపురంలో వెంకటరమణ సేవా చారిటీ ద్వారా ట్రస్టు వ్యవస్థాపకులు కొలనువాడ పెదకృష్ణంరాజు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఉచిత ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. జీఎస్ఎల్ ఆస్పత్రి చైర్మన్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు తమ లా భా ల నుంచి కొంత మొత్తాన్ని సమాజాభివృద్ధికి కేటాయించాలన్నారు. ట్రస్టు చైర్మన్ పెదకృష్ణంరాజు మాట్లాడుతూ పలు ఆస్పత్రుల సహకారంతో ప్రత్యేక వైద్యులను రప్పించి సేవలందిస్తున్నామన్నారు. వైద్యులు తీగల రమేష్, వి.రాజశేఖర్ మాట్లాడారు.

విజిలెన్స్ కమిటీ సభ్యుల నియామకం

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మాన్యువల్ స్కావెంజర్స్ కమిటీలోకి నలుగురు సభ్యుల (ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు) నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ అధికారి కె.శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

- సచివాలయాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- నిరంతరాయంగా కార్డుల మంజూరుకు చర్యలు
- కొత్తగా 8,139 కుటుంబాలకు కార్డులు
- 1 నుంచి రేషన్ సరుకుల పంపిణీ



ఏలూరు (మెట్రో): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరిన్ని అవసరాలు తీర్చేందుకు చర్యలు తీసుకుంది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తోంది. దీనిలో భాగంగా తాజాగా ప్రజలకు రేషన్ కార్డులు (బియ్యం కార్డులు) అందించేందుకు చర్యలు తీసుకుంది. రేషన్ కార్డుల జారీ ప్రక్రియను మరింత సులభతరం చేసి అర్హులందరికీ మంజూరు చేసేలా ఏర్పాట్లు చేసింది. పేద కుటుంబాలకు జీవనాధారమైన రేషన్ కార్డుల జారీని నిరంతరాయంగా చేసింది. గతంలో ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తే తప్ప రేషన్ కార్డులు మంజూరయ్యేవి కావు. ఇటువంటి అవస్థలకు చెక్ పెడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా బియ్యం కార్డుల జారీకి చర్యలు తీసుకుంది.

వలంటీర్ల ద్వారా గుర్తిస్తూ..

వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తిస్తూ కార్డులను నేరుగా అందిస్తోంది. తాజాగా ఏలూరు జిల్లాలో 8,139 రేషన్ కార్డులను మంజూరు చేయగా.. వీరందరికీ వచ్చేనెల 1 నుంచి రేషన్ సరుకులు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సైతం నివేదించారు. ఇప్పటికే ప్రతి ఆరు నెలలకొకసారి రేషన్ కార్డులు అందిస్తున్న ప్రభుత్వం తాజాగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను సచివాలయాల్లో నిరంతరాయంగా స్వీకరించాలని ఆదేశించారు. దరఖాస్తులు స్వీకరించిన అనంతరం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించి ప్రతి ఆరు నెలల్లోపు అర్హులను గుర్తించి వారికి రేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అర్హతే ప్రామాణికంగా..



అర్హతే ప్రామాణికంగా రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ కార్డులు అందించే ప్రక్రియను చేపట్టాం. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది. తాజాగా కార్డులు మంజూరైన వారికి సెప్టెంబర్ నెల నుంచి రేషన్ సరుకులు సైతం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– బి.లావణ్యవేణి, జాయింట్ కలెక్టర్, ఏలూరు

మండలాల వారీగా జారీ అయిన కార్డులు

మండలం	కార్డులు	మండలం	కార్డులు
వేలేరుపాడు	52	నూజివీడు	431
కుక్కునూరు	84	టి.నర్సాపురం	275
కలిదిండి	281	పెదపాడు	312
లింగపాలెం	245	పెదవేగి	427
జీలుగుమిల్లి	111	నిడమర్రు	249
చాట్రాయి	194	కొయ్యలగూడెం	271
ఆగిరిపల్లి	325	చింతలపూడి	454
కైకలూరు	313	ఉంగుటూరు	380
ముదినేపల్లి	250	ముసునూరు	289
దెందులూరు	302	బుట్టాయగూడెం	217
మండవల్లి	227	జంగారెడ్డిగూడెం	429
ద్వారకాతిరుమల	330	భీమడోలు	337
పోలవరం	155	ఏలూరు	933
కామవరపుకోట	246	మొత్తం	8,139

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి : కలెక్టర్



ఎస్పీ, జేసీతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి ముందస్తుగా జిల్లాలో దుర్బరమైన ప్రాంతాలను గుర్తించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాష్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి క్లిష్టమైన పోలింగ్ స్టేషన్లు, ముందస్తు చర్యలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో లోక్‌సభ, శాసన సభకు జరిగిన ఎన్నికల్లో నేరాల కారణంగా రీపోలింగ్ నిర్వహించిన పోలింగ్ స్టేషన్ల వివరాలు తదితరాలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. క్రిమినల్ నేరాలు, కుల, మత ఘర్షణలు, కోడ్ ఉల్లంఘన, నగదు, వస్తువుల స్వాధీనం, అడ్డగింపులు వంటివి పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఖర్చుకు సంబంధించిన సున్నితమైన పాకెట్ల వివరాలు, రీపోలింగ్, చట్టాల ఉల్లంఘన కేసుల వివరాలు పరిశీలించాలన్నారు. నిర్బంధంలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలు, సెక్టార్‌లోని వ్యక్తుల పేర్లు, రాష్ట్ర ఎక్సైజ్ చట్టం కింద నమోదైన కేసుల సంఖ్య, ఆయుధాలు, నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ కేసులు, వారంటీల జాబితా తదితరాల వివరాలు సేకరించాలన్నారు.

కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు



శ్రీరంగనాథరాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా కమిటీ సెక్రటరీ రవీంద్రప్రసాద్

పోడూరు/పెనుగొండ: వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని జిల్లా కమిటీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. జిల్లా నూతన కమిటీలో స్థానం పొందిన నాయకులు, పార్టీ శ్రేణులు శనివారం అధ్యక్షుడు శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు, రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ సెక్రటరీ కొండేటి రవీంద్రప్రసాద్ (వేడంగిపాలెం), జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, మండల ఇన్‌చార్జి కలిదిండి గణపతిరాజు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, పెనుమదం సొసైటీ చైర్మన్ కొత్రపాటి వీరాస్వామి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు వద్లపాటి సురేష్, పెనుగొండ మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ముచ్చెర్ల శ్రీరామ్, నూతన కమిటీ సభ్యుడు గొల్లపల్లి బాలకృష్ణ, పెనుగొండ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు వేగిరాజు శ్రీనివాసరావు తదితరులు శ్రీరంగనాథరాజును కలిసిన వారిలో ఉన్నారు.

రాష్ట్రానికి మళ్లీ జగనే ముఖ్యమంత్రి

- సర్వేలన్నీ అదే చెబుతున్నాయి
- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ఇరగవరంలో స్వయం సహాయక సంఘ మహిళలకు సున్నావడ్డీ చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే అని అన్ని సర్వేలు చెబుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఇరగవరం జెడ్పీ హైస్కూల్‌లో స్వయం సంఘాల మహిళలకు 4వ విడత వైఎస్సార్ సున్నావడ్డీ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైమ్స్‌నౌ సర్వేలో 24 నుంచి 25 ఎంపీ సీట్లు వైఎస్సార్ సీపీకి వస్తాయని చెప్పారని, దీనిని బట్టి చూస్తే 165 నుంచి 175 ఎమ్మెల్యే సీట్లు గెలుచుకుంటామన్నారు. గతంలో టైమ్స్‌నౌ సర్వే నిజమైందని అన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేశారని, హామీ ఇవ్వకపోయినా సున్నావడ్డీ అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ కింద రూ.25 వేలు, సున్నా వడ్డీ కింద రూ.7 వేల కోట్లు మొత్తం రూ.32 వేల కోట్ల లబ్ధి చేకూర్చారన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గత టీడీపీ పాలనలో డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి మహిళలను మోసం చేశారని, దీనిపై పవన్‌కల్యాణ్ ఎందుకు ప్రశ్నించలేదని మంత్రి కారుమూరి నిలదీశారు. వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలన ఇలానే కొనసాగితే తమకు మనుగడ ఉండదని ప్రతిపక్షం, దత్తపుత్రుడు బెంబేలెత్తిపోతున్నారని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలు రద్దుచేసి పేదల నోట్లో మట్టి కొట్టాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని మండిపడ్డారు. ఇరగవరం మండలంలో 1,484 స్వయం సహాయక సంఘాలకు రూ.2 కోట్ల 18 లక్షల సున్నావడ్డీ చెక్కును మంత్రి అందజేశారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలు మంత్రి కారుమూరిని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

టీటీడీ బోర్డులో నలుగురు బీసీలకు స్థానం



హర్షం వ్యక్తం చేస్తున్న ఏలూరు జిల్లా బీసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): బీసీలు అంటే బ్యాక్ బోన్ అని మరోసారి రుజువు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో ఎన్నడూ లేనివిధంగా బీసీలు నలుగురికి స్థానం కల్పించడం ఆనందనీయమన్నారు. సిద్ధవటం యానాదయ్య (నాయీ బ్రాహ్మణ), పొన్నాడ సతీష్ (అగ్నికుల క్షత్రియ), నెరుసు నాగ సత్యం యాదవ్ (యాదవ), మేకా శేషుబాబు (గౌడ)కు స్థానం కల్పించడం గొప్పవిషయమన్నారు. జిల్లా యాదవ సంఘం నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, చిదరబోయిన శ్రీనివాసరావు, కిలారి బుజ్జి, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య పాల్గొన్నారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు

భీమవరం (ప్రకాశంచౌక్): విద్య, వైద్యారోగ్య శాఖలు, సచివాలయ సిబ్బంది సమష్టి కృషితో బాధ్యతగా పనిచేసి సత్ఫలితాలు తీసుకురావాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం భీమవరం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మానవాభివృద్ధిలో విద్య, వైద్యారోగ్యశాఖలు కీలకమన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలంతా తప్పనిసరిగా విద్యనభ్యసించాలని, ఈ మేరకు ప్రతి ఇంటా సర్వే చేసి డ్రాప్‌అవుట్ విద్యార్థులను గుర్తించాలన్నారు. వారిని తప్పనిసరిగా బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్ తప్పిన విద్యార్థులు కూడా చదువు కొనసాగించేలా చూడాలన్నారు.

28 నుంచి రక్తహీనతపై సర్వే

ఈనెల 28 నుంచి ఇంటింటా సర్వే చేసి రక్తహీనత గల మహిళలు, కిశోర బాలికలు, పిల్లలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. వారికి వెంటనే చికిత్స ప్రారంభించి పోషకాహారం, మెడికల్ కిట్లు పంపిణీ చేయాలన్నారు. అలాగే వారి ఆరోగ్యాన్ని తరచూ పరిశీలించాలన్నారు. ఇంటింటికీ సర్వే చేసి రక్తహీనత కలిగిన మహిళలు, గర్భిణులు, బాలింతలను, కౌమార దశలో ఉన్న బాలికలు, పిల్లలను గుర్తించి వారికి వెంటనే చికిత్స ప్రారంభించాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో రక్తహీనత గల వారి వివరాలు డిస్‌ప్లే చేయాలన్నారు.

నూరుశాతం లక్ష్యం సాధించాలి

గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సర్వేలో ప్రతి సచివాలయం నూరు శాతం లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. సోమవారం నుంచి వారం పాటు జీఈఆర్ సర్వే నిర్వహిస్తారని, 18 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా విద్య అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. డీఈఓ ఆర్.వెంకటరమణ, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



కృతజ్ఞతలు తెలుపుతున్న నాయీ బ్రాహ్మణులు

ఉండి: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గంలో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని నాయీ బ్రాహ్మణ సేవా సంఘ రాష్ట్ర కార్యదర్శి మల్లువలస వీర వెంకట సత్యనారాయణ అన్నారు. సంఘ రాష్ట్రాధ్యక్షుడు సిద్ధపట్నం యానాదయ్యకు టీటీడీ పాలకమండలి సభ్యుడిగా నియమించడంపై శనివారం ఉండిలో సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు తానున్నానని అభయమిచ్చి ముందుకు నడిపిస్తున్న సీఎం జగన్‌ను చూసి యావత్తు ప్రజానీకం సంతోషిస్తోందన్నారు. తిరుమల కొండపై ఆలయ నిర్మాణం జరిగిన రోజుల్లో నాటి ప్రభువులు నాయీ బ్రాహ్మణులను వంశపారంపర్య ధర్మకర్తలుగా నియమించారని, అయితే తర్వాత రోజుల్లో రాజకీయ పార్టీలు తమను విస్మరించాయన్నారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ అన్ని ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయించారన్నారు. ముఖ్యమంత్రి మేలును జీవితాంతం గుర్తించుకుంటామని, ఆయన అన్నివేళల్లో అండగా ఉంటామన్నారు. సంఘ జిల్లా నాయకులు మల్లువలస రవీంద్రనాథ్, ముత్యాలపల్లి రాంబాబు, సత్యనారాయణ, చంద్రరావు, దుర్గారావు, అప్పారావు, వీర్రాజు, అతవ ప్రసాద్, సాంబశివ పాల్గొన్నారు.

వైఎస్సార్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్–2023 అత్యున్నత పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్టు ఏలూరు జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. ఈనెల 28లోపు నిర్దిష్ట నమూనాలో దరఖాస్తులు పంపాలని అధికారులను ఆదేశించారు. ప్రజాసేవలో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులు, సంస్థలకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ పురస్కారాలు అందిస్తోందన్నారు. కళలు, సామాజిక సేవ, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసిన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీస్, స్పోర్ట్స్ తదితర రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వ్యక్తులు, ఎన్జీఓలు, సంస్థలు, సంఘాలు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు తమ విజయాలు, సేవలను పేజీకి మించకుండా సమాచారంతో అందించాలని సూచించారు.

డీఎన్నార్ సిబ్బంది ప్రభుత్వానికి సరెండర్



వివరాలు వెల్లడిస్తున్న కళాశాల సిబ్బంది

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల ఎయిడెడ్ సిబ్బంది కోరిక మేరకు వారిని ప్రభుత్వానికి సరెండర్ చేయడానికి కళాశాల యాజమాన్యం అంగీకరించిందని ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి తెలిపారు. శనివారం సిబ్బందితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో కళాశాలలో ఎయిడెడ్ కోర్సులకు అవసరమైన సిబ్బంది లేరని, విద్యార్థులకు నష్టం కలగకుండా అన్‌ఎయిడెడ్ సిబ్బందిని నియమించి నడిపిస్తున్నామన్నారు. ఎయిడెడ్ సిబ్బందిని వేరే కళాశాలలకు రీ డిపార్ట్‌మెంట్ ప్రాతిపదికన బదిలీ చేస్తారని దీనివల్ల వారి సర్వీస్ ప్రయోజనాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఎయిడెడ్ సిబ్బందిని సరెండర్ చేయడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించబడతారని చెప్పారు. డీఎన్నార్ కళాశాలను అన్ ఎయిడెడ్‌గా మార్చినా విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకం వర్తిస్తుందని, దీనివల్ల వారికి ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. కళాశాల యాజమాన్యంపై విద్యార్థి సంఘాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని సిబ్బంది ఖండిస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు జి.మోజెస్, బీవీ నర్సింహరాజు, బి.జ్యోతి, కె.ఉషారాణి, ఎ.వీరయ్య, కె.గౌతంకుమార్, చెల్లబోయిన రంగారావు, కె.మల్లికార్జున, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హౌసింగ్ ఉద్యోగుల సర్వీస్ పెంచాలని వినతి


తాడేపల్లిలో సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి జ్ఞాపికను అందజేస్తున్న విఠల్‌కుమార్

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీస్‌ను 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పొడిగించేందుకు సహకరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గృహనిర్మాణ ఉద్యోగుల జేఏసీ వైస్ చైర్మన్ ఎస్ఆర్ విఠలకుమార్ శనివారం తాడేపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. ముందుగా సజ్జల రామకృష్ణారెడ్డికి జ్ఞాపికను అందజేశారు. అనంతరం గృహ నిర్మాణ ఉద్యోగుల సర్వీస్‌ను పొడిగించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చినట్లు విఠల్ కుమార్ తెలిపారు. ఇదే విషయంపై ఇప్పటికే దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి వినతిపత్రం అందించామని, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నానిని కలిసి వినతి ఇస్తామన్నారు. రాష్ట్రంలోని 175 మంది ఎమ్మెల్యేలను కలిసి వినతులు ఇవ్వనున్నట్లు విఠల్‌కుమార్ తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వారిలో సొంగా సందీప్, ఎ.రమణకుమార్ పాల్గొన్నారు.

నిరుపేదలకు సత్వర న్యాయం అందించాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి



జస్టిస్ ఏవీ శేషసాయిని సన్మానిస్తున్న నరసాపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు

నరసాపురం రూరల్: వివాదాలను పరిష్కరించడమే కాక, నిరుపేదలకు సత్వర న్యాయం అందించడమే న్యాయ వ్యవస్థ లక్ష్యం అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. శనివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్య నాయుడు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి టి.మల్లికార్జున రావు, సీనియర్ అడ్వకేట్లు యామర్తి చంద్రశేఖర్, కె.చిదంబరం, గ్రంధి సీవీ కృష్ణలకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్, నరసాపురం న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ఏవీ శేషసాయి మాట్లాడుతూ దేశం, రాష్ట్రానికి ఎంతోమంది న్యాయ కోవిదులను అందించిన ఘనత నరసాపురం బార్ అసోసియేషన్‌కే దక్కిందన్నారు. సీనియర్ న్యాయవాదులు కోర్టుకు వచ్చినా రాకపోయినా కోర్టు బార్‌లో గడిపితే యువ న్యాయవాదులకు బాసటగా నిలిచిన వారవుతారన్నారు. ఇక్కడ నుంచి అనేక మంది అత్యంత మేధా సంపత్తిగల న్యాయవాదులు ఉన్నత న్యాయమూర్తులుగా ఎదిగారన్నారు. న్యాయ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా పెరిగిందని, అన్ని న్యాయస్థానాలలో కంప్యూటరీకరించడం జరిగిందన్నారు. లాక్‌డౌన్ కాలంతో దృశ్యమాధ్యమం ద్వారా కేసుల విచారణ జరిగిందని, ఈ-కోర్టులు, వీడియోకాన్ఫరెన్సులు, ఈ-ప్రోసీడింగులు, ఈ-ఫైలింగ్‌లు, ఈ-సేవా కేంద్రాల సహాయంతో న్యాయం చేయడం సులభమైందన్నారు. సాంకేతికత వల్ల కాగితాల వినియోగం తగ్గిందని, ఇది సహజ వనరుల పరిరక్షణకు దోహదపడిందన్నారు. న్యాయస్థానాల్లో ముఖ్యంగా జిల్లా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించడానికి వీలుగా న్యాయమూర్తులతోపాటు ఇతర న్యాయ, పాక్షిక న్యాయ అధికారులకు శిక్షణ ఇచ్చే పరిధిని పెంచాల్సిన అవసరం ఉందని జస్టిస్ ఏవీ శేషసాయి అభిప్రాయపడ్డారు. సన్మాన గ్రహీత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు మాట్లాడుతూ నరసాపురం తనకు గురువు లాంటిదన్నారు. ఈ ప్రాంతంలో తన పట్ల చూపిన ప్రేమ, ఆప్యాయత, ఆదరణ జీవితంలో మరువలేనన్నారు. న్యాయమూర్తి సీవై సోమయాజులు ద్వారా ఎంతో నేర్చుకున్నానని, ఆయనే తనకు మార్గదర్శకులన్నారు. నరసాపురం, ఏలూరు, అమలాపురం కోర్టుల ద్వారా అనేక విషయాలు గ్రహించగలిగానన్నారు. కొత్త చట్టాల పరిచయం వ్యాజ్యం స్వభావంలో విస్తృతమైన మార్పుల నేపథ్యంలో కేసులను సమయానుసారంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయ వ్యవస్థలో కేసుల సంఖ్య కంటే నాణ్యతకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. మధ్యవర్తిత్వం, రాజీ, సంధి, లోక్ అదాలత్ వంటి ప్రత్యామ్నాయ న్యాయ వ్యవస్థల ద్వారా నిరుపేదలకు సత్వర న్యాయం అందించడమే ప్రథమ కర్తవ్యంగా భావించాలని హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు జడ్జి టి.మల్లికార్జున రావు, సీనియర్ అడ్వకేట్లు యామర్తి చంద్రశేఖర్, చిదంబరం, గ్రంధి సీవీ కృష్ణలకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ రావు రఘునందనరావు, జస్టిస్ రవి చీమలపాటి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తి పి.పురుషోత్తంకుమార్ సన్మానించారు. అనంతరం జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ రావు రఘునందనరావు, జస్టిస్ రవి చీమలపాటి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తి పి.పురుషోత్తంకుమార్‌లను నరసాపురం న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు గజమాలతో, శాలువలు కప్పి జ్ఞాపికలను ఇచ్చి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు రావు రఘునందనరావు, రవి చామలపాటి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్, జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, పదో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయదుర్గ, సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.శ్రీనివాస్, సీనియర్ అడ్వకేట్లు యామర్తి చంద్రశేఖర్, కె.చిదంబరం, గ్రంధి సీవీ కృష్ణ, డీఎస్పీ కె.రవిమనోహర ఆచారి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్యనాయుడు, వైస్ చైర్మన్ అందే మణి, కార్యదర్శి ఆర్జీకే బాబ్జి, న్యాయవాదులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో భారీ వర్షం

గంట వ్యవధిలో 69.8 మి.మీ. వర్షపాతం నమోదు


టీటీడీ కల్యాణ మండపం వద్ద గోతుల్లో చేరిన వర్షపు నీరు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉదయం 6 గంటల వరకు సాధారణంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారి ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. దాదాపు గంటకు పైగా ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లు పొంగి పొర్లాయి. పలు లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. కాగా, ఈ ఒక్క గంట వ్యవధిలోనే 69.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ తెలిపారు. పెంటపాడు మండలంలో 24.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందన్నారు.

చోరీ కేసులో నిందితుడికి 6 నెలల జైలు

తణుకు: పెనుమంట్ర పోలీసుస్టేషన్ పరిధిలో దొంగతనం కేసులో నిందితుడి నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ శనివారం తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పోతర్లంక సాయిరాం తీర్పు చెప్పారు. మార్టేరులోని శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గతేడాది డిసెంబర్ 20న తణుకుకు చెందిన వరదా దినకరకుమార్ రూ.1.50 లక్షలు చోరీ చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పెనుమంట్ర ఎస్సై బి.సురేంద్రకుమార్ దర్యాప్తు చేపట్టి దినకర్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా వాదోపవాదాలు అనంతరం నిందితుడికి జైలు శిక్ష ఖరారు చేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్యక్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంతో పాటు, అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల తదితర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

గడపగడపకు సంక్షేమం


తాడేపల్లిగూడెం రూరల్: కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



వర్షంతో ఫిట్‌నెస్ పరీక్ష రద్దు

- 26వ తేదీ పరీక్ష సెప్టెంబర్ 11కు వాయిదా
- 28 నుంచి యథావిధిగా ఎస్సై అభ్యర్థులకు పరీక్షలు
- ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ వెల్లడి


అభ్యర్థులకు సూచనలిస్తున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న ఎస్సై పోస్టుల దేహదారుఢ్య పరీక్ష శనివారం వర్షం కారణంగా రద్దు అయ్యింది. మొదటి రోజు శుక్రవారం విజయవంతంగా పోటీలు నిర్వహించగా, రెండో రోజు భారీవర్షంతో పోటీలు వాయిదా వేశారు. ఈనెల 26న జరగాల్సిన పరీక్షలు వాయిదా వేయటంతో ఈ పరీక్షలను సెప్టెంబర్ 11వ తేదీన నిర్వహిస్తామని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులంతా పరీక్షలకు సిద్ధపడాలని చెప్పారు. ఇక సోమవారం 28వ తేదీన జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలు యథావిధిగా నిర్వహిస్తామన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన

జంగారెడ్డిగూడెం: తనకు న్యాయం చేయాలని కోరుతూ భర్త ఇంటి ముందు ఒక మహిళ నిరసనకు దిగింది. పట్టణంలో శనివారం జీలుగుమిల్లి మండలానికి చెందిన వెంకాయమ్మ అనే గిరిజన మహిళ ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న భర్త ఇంటి ముందు తన కొడుకుతో సహా నిరసన చేపట్టింది. తమకు 11 ఏళ్ల క్రితం వివాహం అయ్యిందని, అయితే కొంతకాలంగా భర్త తనతో ఉండటం లేదని ఆరోపించింది. అంతేగాక, వేరే మహిళను వివాహం చేసుకోవడంతో, తనకు, తన బిడ్డకు న్యాయం చేయాలని కోరింది. బంధువులు, స్నేహితులు ఆమెకు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. అయితే సమస్యను పెద్దల వద్ద పరిష్కరించుకోవాలని పెద్దలంతా సూచించడంతో మహిళ, ఆమెకు మద్దతు తెలిపిన స్నేహితులు, బంధువులు వెనుదిరిగి వెళ్లారు. ఆదివారం పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించుకుంటామని వెల్లడించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

కాళ్ల: వివాహిత అదృశ్యంపై కాళ్ల పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జక్కరం గ్రామానికి చెందిన ఓ వివాహిత భర్తతో గొడవపడి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన వివాహిత మృతదేహం లభ్యం


బంగారు అరుణ కుమారి (ఫైల్)

తణుకు: కుటుంబ కలహాలు నేపథ్యంలో తణుకుకు చెందిన వివాహిత కాల్వలో పడి గల్లంతైన ఘటనలో ఆమె మృతదేహాన్ని శనివారం పట్టణ పోలీసులు గుర్తించారు. పట్టణానికి చెందిన బంగారి అరుణకుమారి (20) ఈనెల 25న స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని వంతెన పైనుంచి కాలువలోకి దూకి గల్లంతైంది. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తణుకు మండలం వేల్పూరు గ్రామ పరిధిలోని గోస్తనీ కాల్వలో అరుణకుమారి మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైలు కిందపడి పెయింటర్ ఆత్మహత్య


ఘటనా స్థలంలో శివరామకృష్ణ మృతదేహం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం శివారులో రైలు కింద పడి ఓ పెయింటర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ట్రాక్‌పై మృతదేహం రెండు ముక్కలుగా పడి ఉండటాన్ని రైల్వే పోలీసులు శనివారం ఉదయం గుర్తించారు. సమీపంలో ఫోన్ నంబర్లతో కూడిన ఓ పుస్తకం పోలీసులకు లభించింది. దీని ఆధారంగా మృతుడి వివరాలను సేకరించగా, మృతుడిని తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురానికి చెందిన శిరిగి శివరామకృష్ణ (44)గా శనివారం రాత్రి గుర్తించారు. మృతుడు పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడని, 20 ఏళ్ల క్రితం వివాహమైందని పోలీసులు తెలిపారు. మృతుడు కొన్నేళ్లుగా మద్యానికి బానిసై పనులకు వెళ్లడం లేదు. దీంతో రెండేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. శివరామకృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

మైనార్టీ మహిళా అధికారిణిపై అసత్య ప్రచారం తగదు


ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎండీ కమీలు జమా

ఏలూరు టౌన్: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మైనార్టీ మహిళా అధికారిణి షిరీన్ బేగంపై కొందరు టీడీపీ ఏజెంట్లు అసత్య ప్రచారాలు చేస్తూ ఇబ్బందులకు గురిచేయటం దారుణమని, మైనార్టీ హక్కుల సంఘం పేరుతో మైనార్టీ మహిళను ఇబ్బందులకు గురిచేయటం సిగ్గుచేటని ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ డాక్టర్ ఎండీ కమీలు జమా అన్నారు. ఏలూరులో ఆయన శనివారం మాట్లాడుతూ నిజాయితీగా వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణకు కృషి చేస్తున్న షిరీన్‌బేగంపై అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న టీడీపీ ఏజెంట్ ఫారూక్ షుబ్లి అనుచిత వ్యాఖ్యలు చేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. టీడీపీ హయాంలో వక్ఫ్‌బోర్డును అవినీతిమయం చేసి వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యేలా చేసి ముస్లిం మైనార్టీలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం మహిళా అధికారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఫారూక్ మైనార్టీలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఆరిఫ్, తదితరులు ఉన్నారు.

వికాస్ విద్యా సంస్థపై విచారణ

- రికార్డులు సీజ్, ఎంఈఓ ద్వారా విద్యార్థులకు టీసీల మంజూరు
- జంగారెడ్డిగూడెంలో డీఈఓ పి.శ్యామ్‌సుందర్ వెల్లడి


జంగారెడ్డిగూడెంలో వికాస్ విద్యాసంస్థలో విచారణ చేస్తున్న డీఈవో పి.శ్యామ్‌సుందర్

జంగారెడ్డిగూడెం: ఫీజులు చెల్లించినా టీసీలు ఇవ్వడం లేదని స్పందనలో తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదులపై కలెక్టర్ వి.ప్రసన్నవెంకటేష్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెంలోని వికాస్ విద్యా సంస్థపై విచారణ చేసి రికార్డులు సీజ్ చేసి, ఎంఈఓకు బదిలీ చేసినట్లు డీఈఓ పి.శ్యామ్‌సుందర్ చెప్పారు. విచారణ అనంతరం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్న వికాస్ విద్యా సంస్థపై మూడు వారాలుగా స్పందనలో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫీజులు చెల్లించినప్పటికీ టీసీలు మంజూరు చేయడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఇలా సుమారు 20 వరకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీనిపై ఈ నెల 16న మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసు ఇచ్చామని, అయితే విద్యాసంస్థల కరస్పాండెంట్ ఊరకర్ణం జగన్నాధరావు సమాధానం ఇవ్వలేదన్నారు. ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు శనివారం విద్యాసంస్థలను తనిఖీ చేసి, ఫిర్యాదులపై వివరణ అడిగామన్నారు. తాము టీసీలు సక్రమంగా ఇస్తున్నామని పేర్కొన్నప్పటికీ, వాస్తంగా జరగడం లేదని గుర్తించామన్నారు. దీంతో అడ్మిషన్ రిజిస్టర్‌తో పాటు రెండు టీసీ బుక్‌లను స్వాధీనం చేసుకుని ఎంఈవోకు అప్పగించామన్నారు. ఇక నుంచి ఎంఈవో ద్వారా టీసీలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వికాస్ విద్యాసంస్థలకు పూర్తి స్థాయిలో ప్రభుత్వ గుర్తింపు లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించడం లేదని గుర్తించామన్నారు. ఈ విషయాలను కలెక్టర్‌కు నివేదిస్తామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. విచారణలో డీఈవోతో పాటు ఎంఈవో బి.రాముడు, ఎంఈవో-2 జి.రాములు, ఆర్ఐ రమేష్, జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్, ఎస్సై ఎం.సాగర్ బాబు పాల్గొన్నారు.

220 మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం


నిందితులు, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై రామకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు పడమరవీధి పెదపాడు వంతెన సమీపంలో శనివారం నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 220 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏలూరు వన్‌టౌన్ ఎస్ఐ ఎస్.రామకృష్ణ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ ఆదేశాలతో వన్‌టౌన్ ప్రాంతంలో వాహన తనిఖీలు చేస్తుండగా పెదపాడు మండలం వీరమ్మకుంట గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు, పెద్దిరాజు అనుమానాస్పదంగా ఉండటంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారణ చేయగా, మద్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి 180 ఎంఎల్ మద్యం బాటిల్స్ 220 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గా గుర్తించి, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం వేధింపులు.. భర్తపై కేసు

భీమవరం అర్బన్: అదనంగా కట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. యనమదుర్రుకు చెందిన వీరవల్లి మాణిక్యంకు అదే గ్రామానికి చెందిన సత్యనారాయణకు 17 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఇటీవల కొంతకాలంగా సత్యనారాయణ అదనపు కట్నం తీసుకురమ్మని మాణిక్యంను వేధిస్తుండటంతో ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నాగమ్మ తల్లికి భక్తులు సారె సమర్పణ


తణుకులో సారె, పసుపు కుంకుమతో నాగమ్మ తల్లి

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారి గౌతమి సాల్వెంట్ ప్రాంతంలో ఉన్న శ్రీచక్రసహిత నాగ దుర్గాదేవికి (నాగమ్మ తల్లి) శనివారం భక్తులు సారె సమర్పించారు. వివిధ రకాల మిఠాయిలు, అరటి పండ్లు గెలలు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు వంటివి నాగమ్మ తల్లికి సారెగా భక్తులు ఆలయానికి తీసుకువచ్చారు. రాత్రికి అమ్మవారి సమక్షంలో ఉంచిన సారెను ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు భక్తులకు పంపిణీ చేయనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు


ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామి వారికి శనివారం విశేష పూజలు జరిపారు. తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ నిర్వహించారు. ఉదయం అర్చనలుచేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్‌అండ్‌డీ షోకేస్

సాక్షి, భీమవరం: స్థానిక విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఆర్‌అండ్‌డీ షోకేస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో ఆర్‌అండ్‌డీ కీలకపాత్ర పోషిస్తుందని, ఇది టాలెంట్ హంట్ ఈవెంట్ పరిష్కారాన్ని చురుగ్గా ఆలోచించి ముందుకు తీసుకురావడానికి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కళాశాల డీన్ ఎస్.పద్మావతి మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులకు ఆర్‌అండ్‌డీ షోకేస్ ద్వారా ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రదర్శన, పరిశోధన పత్ర ప్రదర్శన, మీ ఆలోచను పిచ్ చేయండి వంటి ఈవెంట్స్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె శ్రీనివాస్, కోకన్వీనర్ జి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఎన్‌ఆర్ కళాశాల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి

వీరవాసరం: డీఎన్‌ఆర్ కళాశాల ప్రైవేటీకరణను నిలుపుదల చేయకపోతే ఆందోళన నిర్వహిస్తామని ఏపీ జన ప్రగతి సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల ప్రభాకర్‌రావు హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందే ఏర్పడిన డీఎన్‌ఆర్ కళాశాలలో ఎందరో విద్యాభ్యాసాన్ని పొంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. డీఎన్‌ఆర్ కాలేజీని ప్రైవేటుపరం చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు నాణ్యమైన ఉన్నత విద్య దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది బానిసత్వ సంకెళ్లలోకి వెళ్లిపోతారని, ప్రైవేట్‌పరం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి

సాక్షి, భీమవరం: తెలుగుభాష తరతరాల చరిత్ర కలిగిందని భాషా ఔన్నత్యాన్ని తెలుసుకుని ప్రతి ఒక్కరూ భాషాభివృద్ధికి కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భీమవరం డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డి శ్రీరామ్ అన్నారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని శనివారం భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎమ్ స్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, సామెతలు, కథలు, కవితలు పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 28న పొట్టిశ్రీరాములు మునిసిపల్ గరల్స్ స్కూల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తామని శ్రీరామ్ చెప్పారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి

భీమవరం అర్బన్: రైతులు ఈ- క్రాప్ తప్పకుండా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆయన శనివారం మాట్లాడారు. మండలంలో 7 వేల ఎకరాలలో సార్వా సాగుకు శ్రీకారం చుట్టారన్నారు. 2 వేల 500 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. మిగిలిన రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. సెప్టెంబర్ 15తో ఈ క్రాప్ నమోదు ముగుస్తుందన్నారు. ఈ క్రాప్ నమోదు వల్ల పంటల బీమా, ధాన్యం విక్రయం, రైతు భరోసా తదితర ప్రభుత్వ పథకాలలో లబ్ధి చేకూరుతుందన్నారు. సార్వా సాగుకు సంబంధించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వివక్ష లేకుండా అర్హులకు సంక్షేమం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కొండ్రుప్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం


తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: కుల మతాలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు.అనంతరం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల మంది పేదలకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.2.25లక్షలు వరకు సాయం అందిస్తున్నట్టు తెలిపారు. మహిళల పేరన దాదాపు 10 నుంచి 12 లక్షలు విలువైన ఆస్తిని ఒక అన్నగా అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. తద్వారా ఒక మంచి వ్యక్తికి తమ ఓటు వేశామని భావిస్తున్నారన్నారు. 14 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు పేరు ఎత్తేందుకు సైతం ప్రజలు ఇష్టపడటం లేదన్నారు. చంద్రబాబు నమ్మించి మోసగించాడని దుయ్యబడుతున్నారన్నారు. అటువంటి చంద్రబాబును వెతుక్కుని వెళ్లి ఎవరైనా ఓటేస్తారా ? అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు పరమ దుర్మార్గుడిగా ఇంటికి పంపించారన్నారు. చంద్రబాబు, అతని దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ మాటలు రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. జగన్ పాలన ఇలానే కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఏ కష్టం వచ్చినా సీఎం జగన్ గుండెల్లో పెట్టుకుంటారని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లోనూ జగన్ సీఎం కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, చిక్కాల సత్యనారాయణ, గుమ్మళ్ళ తాతారావు, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, డీఈ వీఎన్.వేణుగోపాల్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వై.హరికిషోర్, గ్రామస్తులు పులమోలు వెంకటేశ్వరరావు, కంకట రాజారత్నం, బొట్టా గంగారావు, బండి గణపతిరావు, జొన్నల సత్యనారాయణ, చోడగిరి చినబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి


ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మరో సువర్ణాధ్యాయం మొదలైందని వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ తెలిపారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆహా క్యాంటీన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి లక్ష్యంగా ప్రభు త్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ డా.అనపర్తి శామ్యూల్, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ చైతన్య, బోళెం రామలక్ష్మి, సిటీమిషన్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి


తాడేపల్లిగూడెం రూరల్:నీలాద్రిపురంలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు


తణుకు అర్బన్: మదర్ థెరిస్సా విగ్రహం వద్ద మాట్లాడుతున్న డాక్టర్ అరుణ తదితరులు


పెంటపాడు: దర్శిపర్రులో బాధితులకు రూ. 10 వేలు సాయం అందజేస్తున్న దృశ్యం


తాడేపల్లిగూడెం: వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: యువత మదర్‌థెరిస్సా సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని నీలాద్రిపురం గ్రామ సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మదర్ థెరిస్సా సోషల్ సరీ్వస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో మదర్ థెరిస్సా జయంతిని నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆమె అందించిన సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ రాష్ట్ర కోశాధికారి కొల్లా విజయలక్ష్మీకుమారి, సంస్థ కార్యదర్శి పెదముత్తి ప్రేమ్ కుమార్, సభ్యులు కాపవరపు గణేష్, చిగురుపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి

తణుకు టౌన్: విశ్వ మాతగా గుర్తింపు పొందిన సేవామూర్తి మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమాలు వాడవాడలా నిర్వహించారు. శనివారం తణుకు మహిళా కళాశాలలో నిర్వహించిన మదర్ థెరిస్సా జయంతి వేడుకల్లో థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరి బాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జీ రమ్య, సీహెచ్ రమేష్ బాబు, వలంటీర్లు, విద్యార్థినీలు పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మదర్ థెరిస్సా జయంతి వేడుకలలో విశేష సేవలందించిన ముగ్గురు నర్సులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నల్లజర్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాదికారి ఆర్జి భాస్కరరావు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తణుకులోని అమ్మనాంబ ఆశ్రమంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వరప్రసాద్, కార్యదర్శి బద్దా యేసురత్నం, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాకు ఘన నివాళులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో శనివారం మదర్ థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ మాట్లాడుతూ మదర్ థెరిస్సా సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జాన్ పాల్ సతీష్, డాక్టర్ పుప్పాల రాజరాజేశ్వరి, డాక్టర్ పద్మజారాణి, డాక్టర్ సాయిబాలాజీ, యూనియన్ నాయకులు వైపీఎస్‌బీ రాయుడు, అభివృద్ధి కమిటీ సభ్యులు కుడుపూడి చంద్రరావు పాల్గొన్నారు.

థెరిస్సా జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలి

పెంటపాడు: సమాజసేవాహిత కార్యక్రమాలు చేసిన మథర్‌థెరిస్సా జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. దర్శిపర్రు మదర్ థెరిస్సాయూత్ ఆధ్వర్యంలో 113వ సేవా కార్యక్రమాన్ని శుక్రవారం యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చిట్టిగుళ్ల ప్రసాద్ కుటుంబానికి అండగా రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని ఎంఈవో చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సాయూత్ సంఘ సభ్యులు పాలూరి సతీష్, జువ్వల పాలెపు ఏసు, గంధం రంగ, బాసంశెట్టి రాజు, మాదిరెడ్డి శివ, హనుమంతు, నాగేంద్ర, పాలూరి రూపేష్, బోడపాటి నాగు, అడబాల ఉమామహేష్ అద్దాల మణి, కొండ, కడకట్ల విజయ్, రోహిత్ తో పాటు, స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవామూర్తి మదర్ థెరిస్సా

తాడేపల్లిగూడెం: సేవామూర్తి మదర్ థెరిస్సా అని పలువురు వక్తలు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మదర్ థెరిస్సా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి.కుమారస్వామి, జిల్లా మాజీ గవర్నర్ కప్పల నరసింహమూర్తి, వనచర్ల నాగేంద్ర ప్రసాద్, నార్ని సుధాకర్, రామోజు వీరబ్రహ్మం, చిప్పాడ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు

అత్తిలి: మానవ సేవ చేయడంలో మదర్ థెరిస్సా నిలువెత్తు నిదర్శనమని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శింగులూరి చంద్రశేఖర్ అన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా శనివారం అత్తిలి లయన్స్‌క్లబ్ భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వర్ధినీడి వెంకటశివ, దాసం బాబ్జి, శిరగాని నాగేశ్వరరావు, పట్నాల వెంకటేశ్వరరావు, శీతాల వెంకట నారాయణ, యాతం రాంబాబు, వడ్డి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్


బాధితుని సతీమణి సుజాతకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపకరిస్తుందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయం వద్ద నందమూరు గ్రామానికి చెందిన పరిటాల వీరభద్ర బాపూజీ కాలి శస్త్ర నిమిత్తం రూ.2.30లక్షలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బాధితుని సతీమణి సుజాతకి అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించుకోవడం ద్వారా రూపాయి కట్టాల్సిన అవసరం లేదన్నారు. ప్రైవేట్ వ్యక్తుల మాటలు నమ్మి కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందడం వల్ల ఖర్చు భారమవుతుందన్నారు. ఆరోగ్య ఇబ్బందులు ఉన్న వారు తనను సంప్రదిస్తే వారి వైద్యానికయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోనేటి దానయ్య, వీర్లపాటి సత్యనారాయణ, మునికోటి అన్నవరం, గొర్పిపూడి సీతారాముడు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం


తణుకులో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో వైఎస్సార్‌సీపీ నాయకుడు నత్తా భానువరప్రసాద్ నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ హైర్ బస్సులను శనివారం మంత్రి కారుమూరి ప్రారంభించి మాట్లాడారు. వేగం కన్నా ప్రాణం మిన్న అనే సూక్తిని పాటిస్తూ ప్రజలంతా ఆర్టీసీ బస్సులపైనే ప్రయాణం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రెండు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, కుడుపూడి చంద్రరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి మరింత కృషి


మంత్రి కొట్టు సత్యనారాయణకు పుష్ప గుచ్ఛం ఇస్తున్న పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కృష్ణప్రసాద్

పెంటపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పని చేసి పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి కృష్ణప్రసాద్ శనివారం మర్యాద పూర్వకంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను కలిసి ఆశీస్సులు అందుకొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ కృష్ణప్రసాద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మట్టా సత్యనారాయణ, జట్లపాలెం సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, పార్టీ నాయకులు గుమ్మళ్ల రత్నరాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి


పెంటపాడు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి హైమావతి

పెంటపాడు: అధికారుల, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. పెంటపాడు మండల సర్వసభ్య సమావేశం శనివారం మండల పరిషత్ హాల్‌లో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ హైమావతి మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అధికారులు ,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పథకాలు ప్రజలు నిత్యం చేరువగా ఉండేలా చూడాలన్నారు. ఈ వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా తాగునీరు, పారిశుద్ధ్యం పట్ల పంచాయతీలు శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే రహదారిని తొలగించడంపై ముదునూరు సర్పంచ్ భావన ధాన్యలక్ష్మి అభ్యంతరం తెలిపారు. జట్లపాలెం గ్రామంలో ఇళ్లు నిర్మించుకొన్న లబ్ధిదారులకు సకాలంలో సొమ్ములు పడేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని జట్లపాలెం ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి కోరారు. ఎంపీడీవో బాలాజీ, వైఎస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'కొట్టు' నాయకత్వంలో హిందూ దేవాలయాలకు కొత్త శోభ


హౌసింగ్‌బోర్డు కాలనీలో తాతా శ్రీనివాసరావు, జగజ్జీవన్‌లను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ నాయకత్వంలో హిందూ దేవాలయాలకు కొత్త శోభ సంతరించుకుంటుందని ద్వారకాతిరుమల ట్రస్ట్ బోర్డు సభ్యుడు తాతా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో హౌసింగ్ బోర్డు కాలనీలో తాతా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తెన్నేటి జగజ్జీవన్‌లను పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్న తిరుపతి వేంకటేశ్వరస్వామివారికి సేవ చేసే భాగ్యం కల్పించిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తెన్నేటి జగజ్జీవన్ మాట్లాడుతూ తనలాంటి సామాన్య కార్యకర్తకు జిల్లా పార్టీ ఉపాధ్యక్ష పదవినిచ్చిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. 2024 ఎన్నికల్లోనూ పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గంగుల వెంకటరత్నం, కోట రాంబాబు, సాధనాల త్రిమూర్తులు, ఆర్ముగనాథన్, పులప మురళీకృష్ణ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం


రావిపాడులో రహదారులపై వర్షం నీరు నిలిచిన దృశ్యం

పెంటపాడు: శనివారం తెల్లవారు జామున, ఉదయం ఒక్కసారి భారీ వర్షం కురవడంతో మండలంలో పలు గ్రామాల్లో వర్షంనీరు నిలిచిపోయింది. ప్రధానంగా రావిపాడు గ్రామంలో పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు పొంగాయి. ఆ నీరు రోడ్డుపైకి పారడంతో రహదారుల్లో సుమారు రెండు గంటల పాటు నీరు లాగక నిలిచిపోయింది. అనంతరం సర్పంచ్ సూరిబాబు ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టడంతో సమస్య పరిష్కారం అయ్యింది. శనివారం భారీ వర్షం కురవడంతో పెంటపాడు మండలంలో పలు గ్రామాల్లో నీరు నిలిచింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

దువ్వ సర్పంచ్ బాబుకు సత్కారం

తణుకు టౌన్: జాతీయ స్థాయిలో గ్రామ అభివృద్ధిపై జరిగిన సెమినార్‌లో పాల్గొని గ్రామ ప్రగతిపై వివరించిన తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబును శుక్రవారం రాత్రి గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈనెల 21 నుంచి 23 తేదీ వరకూ శ్రీనగర్‌లో జరిగిన జాతీయ స్థాయిలో జరిగిన వర్క్ షాపులో మన జిల్లా నుంచి గ్రామ సర్పంచ్‌ల నుంచి ఎంపికైన దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డాబాబు వర్క్‌షాపులో దువ్వ గ్రామంలో జరిగిన అభివృద్ధిపై వివరాలను వివరించారు. ఈకార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కడియం వీరబాబు, గ్రామ కార్యదర్శి నరశింహమూర్తి, ఎంపీటీసీలు టీ శ్రీనివాసు, పెనుమాక అశోక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్‌జీ కృష్ణ, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, పార్టీ నాయకులు డీవీ కృష్ణంరాజు, సిర్రా జాన్, చెట్టే సునీల్, మాంద్రు కుమార్, కడిమి రాంబాబు, మధు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల వైద్యానికి నిధులు కేటాయించాలి


తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఐలు నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో 50వేల మంది న్యాయ వాదులు ఉన్నారని, నిత్యం అనేక మానసిక ఒత్తిడిలకు గురై అనారోగ్యాల పాలవుతున్నారని, వారి వైద్యానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దిగుపాటి రాజగోపాల్ కోరారు. శనివారం స్థానిక బీవీఆర్‌కళా కేంద్రంలో ఐలు జిల్లా కమిటి సమావేశం వి.శైలజ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజగోపాల్ మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు వృత్తి నైపుణ్యం కలిగే వరకు ప్రతీ నెలా రూ.10వేలు స్టయిఫండ్ ఇవ్వాలని, ప్రభుత్వమే ఉచిత వృత్తి శిక్షణ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షురాలు వి.శైలజ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఉన్న మహిళల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఐదుజిల్లా కమిటి సభ్యులు వీవీ.వేణుగోపాలచౌదరి, కౌరు వెంకటేశ్వర్లు, లక్ష్మి, జి.విజయభాస్కర్, ఎం.ఎం. ఈశ్వరయ్య, పి.నగేష్, పి.రాజారావు, లతా కుమారి, పి.వెంకట్, వై.మణికంఠ తేజ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూ హక్కుతో రైతులకు మేలు


ఇరగవరంలో జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం:తణుకు నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేయడం జరుగుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా ఇరగవరం మండలం కె కుముదువల్లి, ఆర్ కంద్రిక గ్రామాల్లో సర్వే పూర్తి చేసి రైతులు, భూ యాజమానులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధృవ పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల పడుతున్న ఇబ్బందులపై దృష్టి సారించి వాటికి శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఈ జగనన్న శాశ్వత భూ హక్కు పథకం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ మల్లిఖార్జునరావు, సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.